


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**118**

**(24‘ జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**జీవితం హాయిగా** గడపడానికి అవలంబించవలసిన విధానాలలో ఉత్తరాలు వ్రాయడం ఒకటి అని సూచించారు శాస్త్రజ్ఞులు. వాటివల్ల ఆనందం, హాయి అనుభవించవచ్చునంటారు.

మంచి ఉత్తరాలు వ్రాయడం అలవరచుకొండి. మీరు వ్రాసే ఉత్తరాలు ఎదుటివాళ్ళు ఆశతో ఎదురుచూచేటట్లుగా ఉండాలి. అంటే అవి చూచి వారు తన్మయులు కావాలనీ, తాదాత్మ్యం చెందాలనీకాదు. పట్టలేని హాస్యంతో పగలబడి నవ్వాలనీకాదు.

హాయిగా వుండే విషయాలు రెండు వ్రాస్తే చాలు. రెండు సున్నితమైన జోక్సు విసిరితే మంచిది. హృదయానికి హత్తుకుపోయే వాక్యాలు ఒకటి రెండు వ్రాయందే ఉత్తరం ముగించవద్దు. ఒకటి, రెండు మధుర స్మృతులు కూడా వివరిస్తే మరీ మంచిది.

"అలాంటి ఉత్తరాలు అందుకున్నవారు వాటిని గొప్ప బహుమతులుగా భావిస్తారు. వాటి కోసం ఆశతో ఎదురు చూస్తారు. అవి చదువుకుంటే వారి మనస్సు హంసరెక్కలవలె మెల్లగా తనకు తానే విసురుకుంటుంది. అంతకన్నా చేయగల సేవ ఏం ఉంటుంది? కవరు మీద మీ దస్తూరీ కనిపించగానే అవతలవాళ్ళు ఆప్యాయంగా ఆ అక్షరాలను కళ్ళకు అద్దుకునేటంత ఆనందం కల్పించాలి. కవరు విప్పకుండానే వారికి అంతులేని ఆనందం ఏర్పడాలి. ముత్యాలతో నిండిన బంగారు భరిణ తెరచినట్లుగా వారా కవరులో గల ఉత్తరాన్ని అందుకోవాలి" అన్నాడు ఒక ప్రఖ్యాత రచయిత.

సామాన్యంగా మనం ప్రతిరోజూ అందుకునే ఉత్తరాలలో మధ్యన ఏదో ఒకటి రెండు ముక్కలు వార్తల క్రింద జమపడతగినవి ఉంటాయి. మొదటి అన్ని ఉత్తరాలకు ఒకటి చివరి పేరాలు అంతే షరా మామూలే అనే పద్ధతిలో ఉంటాయి. చదవడం, మరచిపోవడం. ఒక్క క్షణంలోనే జరుగుతూ ఉంటాయి మామూలుగా. ఇలాటివి చదివినప్పుడు కలిగే భావం ఒక్కటే "వీళ్ళకో జాబు వ్రాసి పడెయ్యాలి ఈ వారంలో" అనేదే

మిగతా విషయాలెలా వున్నా, పోనీ యోగక్షేమాలైనా తరచు తెలుసుకునేందుకు వీలుగా కార్డులు కవర్లకన్నా చౌకగా ఉంచితే కొంత బాగుండేది. ఇంగ్లీషు వాళ్ళ కాలంలోనే బాగుండేది. కానీ పెడితే కార్డు వ్రాసి పోస్టులో పారేస్తే అటు కాశ్మీర్ వరకూ, ఇటు కన్యాకుమారి వరకూ పరుగెత్తేది. ప్రజల సుఖశాంతుల కోసం పాటు పడుతున్నామంటూ పోస్టల్ ధరలు పెంచడమేమిటి? అని ఒక ముసలాయన ఉసూరుమన్నాడు.

ఎవరేమనుకున్నా మనం ఉత్తరాలు వ్రాయక తప్పదు. వద్దంటూనే నెలకో వంద కార్డులు, పాతిక ఇన్‌లాండులు, పది కవర్లు, అరడజను బుక్ పోస్టులు వ్రాస్తూ వుంటాను నేను. ముఖ్యంగా మనకు కొంచెమో, గొప్పో బాకీ వున్నవాళ్ళకు వ్రాయడం తప్పదు. అవన్నీ నిజానికి ‘చావు ఉత్తరాల శాఖకి చేరినట్టే అవుతుంది. తెలిసి కూడా వ్రాస్తూ ఉంటారు. ఇంట్లోవాళ్ళు ఎప్పుడైనా బాకీ విషయం జ్ఞాపకం చేసి "ఇహ అది అలా వదిలిపెట్టెయ్యడమేనా ఏమిటి? నెలకో వందన్నా వసూలు చెయ్యకపోతే ఎలా?" అంటారనుకోండి అప్పుడు కోపం

వచ్చి తీరుతుంది. వెంటనే ఇన్‌లాండు తీసి "ఇది మీకు ఇరవయ్యో ఉత్తరం బాకి వుండి కూడా పంపకపోవడం, కనీసం జవాబన్నా వ్రాయకపోవడం భావ్యం కాదు. మీరు సంఘంలో మంచి స్థానంలో వున్నవారు" అంటూ వ్రాసి పడెయ్యడం జరుగుతూ ఉంటుంది.

అయినా జవాబు వుండదు. బాకీ యివ్వకపోవడం కంటే జవాబు వ్రాయకపోవడం మరీ బాధగా ఉంటుంది. అందువల్ల తర్వాత వ్రాసే ఉత్తరంలో కనీస మర్యాదల గురించి ఒక చిన్న వ్యాసం వ్రాసి పంపడం జరుగుతుంది. ఏం చేసినా రాతికి చక్కిలిగింతలే అవుతాయి.

ఇటీవల ఇలాంటి బాకీవున్న వ్యక్తిని కలుసుకోడానికి బయలుదేరి వెళ్ళాను. ఆ ఊళ్ళో ఆరు రోజులు మకాం వేసి, చివరకు అతణ్ణి పట్టుకుని, "జవాబు వ్రాయకపోవడానికి కారణమేమిటి? అది పట్టుకెళ్ళి కోర్టులో దావా వేస్తాననా? అలాంటి ప్రవృత్తే వుంటే ఇదివరకే వేసేవాణ్ణి. మీ మంచి నిలబెట్టడం నా మర్యాద. నా బాకీ తీర్చడం మీ మర్యాద" అని వాదించి వచ్చాను. కానీ ఇంతవరకు బాకీ రాలేదు, జవాబూ రాలేదు.

ఈ జన్మలో బాకీలు వసూలు చేసుకోవడానికి కొన్ని ఉత్తరాలు వ్రాయడం అవసరం ఆపుతూ ఉంటుంది. వీటికి నోటూ, కాంట్రాక్టూ, సాక్ష్యం, రిజిస్ట్రేషన్ వగైరాలేమీ ఉండదు. అంతా మూజువాణి పద్ధతే.

అందువల్ల ఇలాంటి బాకీలు ఉత్తరాలద్వారా వసూలు కావు. పోనీకదా అని వెళ్ళి కలుసుకుంటే ఒక అరగంట మూజువాణి షరతులు తిరగవేయడం, ఆ మూజువాణితో సంతోషించి చక్కా రావడం జరుగుతూ ఉంటుంది.

అందువల్ల వెనుక జన్మకు సంబంధించిన రుణాలు మన కేమైనా వుంటే చెల్లించి రావడం, మనకు రావలసివుంటే పై జన్మకు వాయిదా వేసుకుని వేదాంతం పండిన పోజుపెట్టి తిరిగిరావడం జరుగుతూ వుంటుంది. వీరిక్కూడా మధ్య మధ్య కార్డులు, ఇన్‌లాండు కవర్లూ పంపడం తప్పదు. ఆ రిక్త హృదయాలు ఈ రిమాండులకు భయపడుతాయా?

ఇటీవల ఒక చదువుకున్న అమ్మాయి మా యింటికి వచ్చి వెడుతుంటే "మీ యోగక్షేమం తెలియచేస్తూ వుండమ్మా" అన్నాం.

"నేను క్షేమంగా వుంటే చాలదా మీకు తెలిచొచ్చేయాలా" అంది నవ్వుతూ. బహుశా మా తెలివితెక్కువతనానికి కావన్ను అనుకుని ఊరుకున్నాం.

మా వదిన కుమారుడు మొన్న వచ్చి వెడుతుంటే "అప్పుడప్పుడూ ఉత్తరం వ్రాస్తూవుండు కొంచెం" అన్నది మా ఆవిడ. అతగాడు "ఏం ఉంటాయి వ్రాయడానికి? నాకేం కనపడవు నిజం చెప్పాలంటే" అంటూ మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

ఎవరేమన్నా మొత్తానికి ఎక్కడినుంచో ఒకచోటనుంచి ప్రతిరోజూ ఒక ఉత్తరమన్నా రాకపోతే ఎంతో బెంగగా ఉంటుంది. అసలారోజు వృధాగా పోయినట్లే కనిపిస్తుంది. బాగా ఆలోచిస్తే పోస్టుమాన్ ఉత్తరాలు అందిస్తుంటే ఏదో బహుమానం అందిస్తున్నట్లే ఉంటుంది.

అలా కాకుండా మన యిల్లు దాటి వెళ్ళిపోతుంటే వెంటనే.

"పోయెనయో ఇల్లుదాటి

ఒక కార్డయిన ఇవకుండ పోయె"

అని పాడుకోవాలనిపిస్తుంది. వారు మాత్రం ఏం చేస్తారు పాపం? ఎన్ని ఉత్తరాలు ఎక్కడ సృష్టించి అందించగలరు? వెనుకటికి ఒకామె అంటూ ఉండేది, మా పోస్టుమాన్ ఉత్తరం ఇచ్చినా, ఇవ్వకపోయినా నవ్వుతూ వెడతాడు ఇంటిముందు నుంచి. నవ్వుతూ ఉంటే చాలదూ ఇవ్వాళ కాకపోతే రేపు తెచ్చి ఇస్తాడు. అతణ్ణి ఎల్లప్పుడూ గౌరవించాలి. నిజమే పాపం వారు ఎండనక, వాననక ఇంటింటికి వచ్చి ఉత్తరాలిచ్చిపోతారు. వాటిల్లో నవ్వుల పంటలూ ఉండొచ్చు, కోర్కెల పేరిట గువ్వల జడుపులూ ఉండొచ్చు. ఒకప్పుడు విరహపు మంటలూ ఉండొచ్చు. ఏదైనా ఉత్తరం ఉదుగర క్రిందనే జమ పడుతుంది.

పూర్వకాలంలో జానపద నాయకి ప్రియుని కోసం విసిరి వేసారి "కాకమ్మ చేతయిన కబురంపడాయే" అని పాడుకునేది. ఇప్పుడా పద్ధతి లేనేలేదు. "కవరు లోపల దాగి తాను నేరుగ రాడాయె" అంటున్నారు. అందుకనే చాలామంది అంటూ ఉంటారు "ఉత్తరం చదువుతుంటే ఆయనవచ్చి ఉరికించినట్లుంటుంది ఇంట్లో" అని.

కార్డులు, వగైరాల వెలలు ఎక్కువైనా వాటి విలువలు తగ్గలేదు.

Post your comments